01ATP06_01ATP06.qxd 06-12-2025 PM 10:50 Page 1






అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 07 డిసెంబర్ 2025 | పేజీలు : 04


# భారత రాజ్యాంగ నిర్మాత, అట్టడుగు వర్గాల భాగ్యవిధాత.. యావత్ జాతికి నిత్య స్ఫూర్తి ప్రధాత

- డా.బి.ఆర్. అంబేద్కర్ జీవితం ఆదర్శనీయం అనుసరణీయం
- సాంఘిక దురాచారమైన బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం
- చదివే వయసులో పిల్లలను తప్పక చదివించాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

**అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 6 ప్రభాతవార్త**

భారత రాజ్యాంగ నిర్మాత, అట్టడుగు బడుగు బలహీన వర్గాల భాగ్య విధాత, యావత్ దేశానికి దిక్సూచి, భారతరత్న డా.బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలు, వారి జీవితం ఆదర్శనీయం, స్ఫూర్తిదాయకం అని.. ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. శనివారం భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 69వ వర్ధంతి సందర్భంగా సాంఘిక సంక్షేమ వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఆ మహనీయునికి సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, సంఘాల నాయకులు, సభ్యులతో కలిసి జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ గారి జీవితం అందరికీ అనుసరణీయం అని, నేడు వారి మహా పరినిర్వాహణ దివస్ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అత్యున్నత భారత రాజ్యాంగం రచించి బడుగు బలహీన వర్గాలకు, అన్ని వర్గాల ప్రజలకు వారి హక్కుల పరిరక్షణకు, పాటించాల్సి న విధులు, ఆదేశ సూత్రాలు తదితరాలు అందులో పొందుపరచి అండగా మార్గదర్శకులయ్యారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాలకు ఎంతో అండగా నిలిచారని తెలిపారు. ఎన్నో ఇబ్బందులు ఉన్నా కూడా తన పాఠశాల విద్య పూర్తి చేసి, ఇతర దేశాలైన యుకె, లండన్ లలో కూడా ఉన్నత విద్యాభ్యాసం చేసిన నిత్య కృషీవలుడు అని అన్నారు. మన జిల్లాలో ముఖ్యముగా ఎస్సీ ఎస్టీ, ఇతర కమ్యూనిటీలలో చిన్న వయసులోనే పిల్లలకు పెళ్లి చేస్తున్నారని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వారిని చదువుకునే వయసులో తప్పక చదివించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ మరియు సాధికార అధికారిణి ఖుష్బూ కొఠారి, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాము నాయక్, వార్డెన్లు, జిల్లా కార్యాలయం ఉద్యోగులు, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, సాంఘీక సంక్షేమ శాఖ ఎఎస్డబ్ల్యూఓలు ఎస్.రామునాయక్, శ్రీనివాసులు, రామ్మోహన్ అధికారులు సిబ్బంది, సంఘ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మీ కేసులపై ఉన్న శ్రద్ధ అన్నదాతలపై లేదా..

- కూటమి పాలనలో ఏ పంటకైనా గిట్టుబాటు ధర కల్పించారా..
- అన్నదాతలు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు - వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం సిటీ, డిసెంబర్ 6 ప్రభాతవార్త**

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజా ప్రయోజనాలను పక్క పెట్టి అతని కేసులపై ఉన్న శ్రద్ధ అన్నదాతలపై పెట్టడం లేదని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. రాజ్యాంగ నిర్మాత డా.బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని జిల్లా వైసిపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ, మేయర్ మహ్మద్ వసీం, ఎస్సీ సెల్ జిఇల్లా అధ్యక్షులు నరసింహులు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్నోబిలేసు హాజరయ్యారు. ఈ సందర్భంగా డా.బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. డా.బిఆర్.అంబేద్కర్ ప్రజా ప్రయోజనాల లక్ష్యంగా రాజ్యాంగాన్ని రచించి అన్ని వర్గాలకు మేలు చేకూరేలా ప్రభుత్వాలకు రాజ్యంగంలో సూచనలు చేశారన్నారు. అయితే అందుకు భిన్నంగా నేడు కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పరిపాలన కొనసాగిస్తోందని విమర్శించారు. ప్రజా ప్రయోజనాల కంటే స్వార్థ ప్రయోజనాలకే కూటమి ప్రభుత్వంలో అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 18 నెలల పాలనలో అన్నివ ర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల 18 నెలల పాలనలో ఏ ఒక్క పంటకు గిట్టుబాటు ధర లేక రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా తయారైందన్నారు. ప్రధానంగా తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక పంటల పెట్టుబడులకు చేసిన అప్పులను తీర్చే మార్గం లేక రైతుల ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. జిల్లాలోని పుట్లూరు మండలం ఎల్లుట్లకు చెందిన అరటి రైతు నాగలింగం పండిన పంటకు గిట్టు బాటు ధర లేక ఆత్మహత్యకు పాల్పడటం అందరినీ కలచివేసే ఘటన అన్నారు. బాధిత రైతు కుటుంబానికి ఆత్మస్థైర్యం ఉండటంతోపాటు రైతాంగానికి తోడుగా ఉంటామని చెప్పడం కోసం తాము ఎల్లుట్ల గ్రామానికి వెళ్తే బాధ్యతా యుతమైన మంత్రి అచ్చెన్నాయుడు శవరాజకీయాలు చేస్తున్నారని మాట్లాడటం సిగ్గు చేటన్నారు. చట్టానికి విరుద్ధంగా తెల్లవారు జామునే రైతు నాగలింగానికి ఎందుకు పోస్టుమార్టం పూర్తి చేసి గ్రామానికి తీసుకెళ్లి పోలీసు బందోబస్తు మధ్య అంతక్రియలు చేశారని ఆయన ప్రశ్నించారు. కేంద్రంలో కూటమి ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ఎంపిలపై ఆధారపడి ఉందని గట్టిగా నిలదీసి రైతులను ఆదుకునే అవకాశం ఉన్నప్పటికీ చంద్రబాబునాయుడు దానిని పట్టించుకోకుండా తన కేసులను మాఫీ చేసుకునేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన విమర్శించారు. రైతులు ఆత్మసైర్థ్యం కోల్పోవద్దని రైతుల పక్షాన వైసిపి పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఆత్మహత్యలు సమస ్యకు పరిష్కారం కాదని, దాని వల్ల మీ కుటుంబం కష్టాల పాలు అవుతుందని గుర్తించుకోవాలన్నారు. నాగలింగం ఘటన తర్వాత అయినా జిల్లాలోని కూటమి ప్రజా ప్రతనిధులు స్పందించి రైతాంగ సమస్య పరిష్కారం, గిట్టుబాటు ధరలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.




అంబేద్కర్ చిత్రపటానికి ఇతర నేతలతో కలిసి నివాళులు అర్పిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత

# రూఫ్ టాప్ సోలార్ పనులు వేగవంతం

- భూసేకరణను త్వరగా పూర్తి చేయండి
- బీసీల కోసం 21 లక్షల రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్



రూఫ్ టాప్లా సోలార్ సిస్టం పై న మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయనంద్

**అనంతపురం కలెక్టరేట్ డిసెంబర్ 06 ప్రభాతవార్త**

ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులకు రూఫ్ టాప్ సోలార్ సిస్టం ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. అనంతపురంలోని కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శనివారం పీఎం కుసుమ్, పీఎం సూర్యఘర్ పథకం మరియు అన్ని ఎన్ఆర్ఈడిసిఏపి ప్రాజెక్టులు, వివిధ పథకాలపై ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ , అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, నెడ్ క్యాప్ మేనేజింగ్ డైరెక్టర్ కమలాకర్ బాబు, ఎపిఎస్పిడిసిఎల్ డైరెక్టర్ పి.అయూబ్ ఖాన్ తదితరులతో సమీక్షా సమావేశాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో 7.48 లక్షల ఎస్సీ,ఎస్టీ గృహ విద్యుత్ వినియోగదారులకు వచ్చే ఏడాది మార్చిలోగా ఫీజిబిలిటీ ఉన్న గృహాలపై రెండు కిలోవాట్ల చొప్పున మొత్తం 415 మెగావాట్ల సామర్థంతో రూఫ్ టాప్ సోలార్ పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. సోలార్ ప్యానల్స్ ను అమర్చిన వెంటనే ఎటువంటి జాప్యం లేకుండా నెట్ మీటర్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో పీఎంకుసుమ్ పథకం కింద 610 మెగావాట్ల సామర్థంతో 1.36 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు సోలార్ విద్యుత్ పనులను పూర్తి చేయాలన్నారు. ఫీడర్ సోలరైజేషన్ పథకం కింద అనంతపురం సర్కిల్ పరిధిలోని 20 ప్రాంతాల్లో 498 ఎకరాల ప్రాంగణంలో 111 మెగావాట్ల సామర్థంతో సోలార్ ప్లాంట్ ల ఏర్పాటుకు సంబంధించి భూసేకరణను వేగవంతం చేయాలని అనంతపురం జిల్లా అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పీఎం సూర్యఘర్ పథకం కింద అనంతపురం జిల్లాలో 35.7 మెగావాట్ల సామర్థంతో 17,870 గృహాలకు రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేయాలని, ఈ పనులను వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 21 లక్షల బీసీ గృహాలకు రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ను అమర్చనున్నట్లు తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు ఘన నివాళి :డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని అనంతపురం జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సమీక్షా సమావేశం ప్రారంభానికి ముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సమాజానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి, అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, నెడ్ క్యాప్ మేనేజింగ్ డైరెక్టర్ కమలాకర్ బాబు, ఎపిఎస్పిడిసిఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి.అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, ఎం, ఉమాపతి, ఏపీఎస్పీడీసీఎల్ జనరల్ మేనేజర్ వి.విజయన్, అనంతపురం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ శేషాద్రి శేఖర్, డిఆర్ఓ ఏ.మలోల, ఆర్డీఓలు కేశవ నాయుడు, వసంతబాబు, ఏబీవీఎస్పి శ్రీనివాస్, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, నెడ్ క్యాప్ పిడి శివశంకర్, డెవలప్మెంట్ అధికారి కిషోర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# ధరల స్థిరీకరణ లేకే రైతు నాగలింగం ఆత్మహత్య

- బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం అందించాలి - మాజీ మంత్రి సాకే శైలజానాథ్

**అనంతపురం సిటీ, డిసెంబర్ 6 ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయకపోవడం వల్లే పండించిన పంటకు గిట్టుబాటు లేక రైతు నాగలింగం ఆత్మహత్య చేసుకోవాల్సి న పరిస్థితి ఏర్పడిందని మాజీ మంత్రి, శింగనమల నియోజకవర్గ సమన్వయ కర్త సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. జిల్లా వైసిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే మాట తప్పారని ఆయన విమర్శించారు. ధరల స్థిరీకరణనిధి ఉంటే అరటి రైతు నాగలింగం ఆత్మహత్య చేసుకునే వాడు కాదని ఆయన పేర్కొన్నారు. బాధిత రైతు తక ఉటుంబాన్ని తాను పరామర్శిస్తే టిడిపి నేతలు తాము శవ రాజకీయాలు చేస్తున్నామని పేర్కొనడం సిగ్గు చేటు అన్నారు. శవ రాజకీయాలకు కేరాఫ్ టిడిపి అని ఆయన విమర్శించారు. రైతులను ఆదుకోవాలన్నదే వైసిపి ఆకాంక్ష అని, ఆ దిశగానే వైసిపి ఐదేళ్ల పాలనలో నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను, కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలు చేశారన్నారు. 18 నెలల పాలనలో చంద్రబాబునాయుడు రైతు సమస్యలపై ఒక్క సమీక్ష కూడా నిర్వహించ లేదని ఆయన విమర్శించారు. గిట్టుబాటు ధర లేక ఆత్మహత్య చేసుకున్న రైతు నాగలింగం కుటుంబానికి రూ.25 లక్షల పరిహారాన్ని అందించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలపై వైసిపి పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. విలేకర్ల సమావేశంలో పలువురు నేతలు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్

## అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విద్యానంద్



ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి కె విజయనందుకు పూల మొక్క ఇస్తున్న జిల్లా ఎస్పీ

**అనంతపురం కలెక్టరేట్ డిసెంబర్ 6 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లా పర్యటన నిమిత్తం శనివారం జిల్లా కలెక్టరేట్ కు చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.విజయానంద్‌కి పూల మొక్కను అందించి సాదర స్వాగతం పలికిన జిల్లా ఎస్పీ పి.జగదీష్.

## ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన జిల్లా అధికారులు



ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పిఎస్ భానుమతినీ మర్యాదపూర్వకంగా కలసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, జిల్లా జడ్జి భీమారావు

**అనంతపురం కలెక్టరేట్ డిసెంబర్ 6 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి మరియు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి జస్టిస్ బి.ఎస్.భానుమతి ని స్థానిక ఆర్.అండ్.బి అతిథి గృహంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందించి ఘన స్వాగతం పలికారు. జిల్లా ఎస్పీతో పాటు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్, జిల్లా జడ్జి ఈ.భీమారావు కలిశారు.

# జె.సి ప్రజాదర్బార్‌కు భారీ స్పందన

- నియోజకవర్గం వ్యాప్తంగా తరలివచ్చిన అర్జీదారులు - సమస్యలు తక్షణ పరిష్కారానికి ఎమ్మెల్యే జె.సి ఆదేశాలు

**తాడిపత్రిటౌన్, డిసెంబర్ 6 ప్రభాతవార్త**

ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి శనివారం చేపట్టిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి భారీ స్పందన కానవచ్చింది. తాడిపత్రి నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని మండలాల నుండి అర్జీదారులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా ప్రభుత్వ అధికారుల వద్దకు తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం వినతి పత్రాలు సమర్పించే ఒక కార్యక్రమం చేపట్టడం శుభ పరిణామమని ఇది ఒక నిరంతర ప్రక్రియ అని దీనిలో ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు (భూమి, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు తదితర సమస్యలపై) ఇస్తే అధికారులు వాటిని స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. తమ నియోజకవర్గ ప్రజల సమస్యలు వినడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రజాదర్బార్‌లో ప్రజలు వివిధ సమస్యలపై దాదాపు 300 పైగా ఫిర్యాదులు అందజేశారు. ఈ ఫిర్యాదులను స్వీకరించి, వాటిని ఆన్‌లైన్ చేసి, పరిష్కారానికి ఒక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలను త్వరగా పరిష్కరించడం, ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చడం ప్రధాన లక్ష్యంగా ముందుకు పోతున్నామన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో వున్నంతకాలం ప్రజల సమస్యలను పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడని. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలు తమ సమస్యలను ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి చెప్పుకునే అవకాశం లభిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శివరామకృష్ణ, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.




అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జె.సి.

ఎన్ని అవాంతరాలు సృష్టించినా

# బైపాస్ రోడ్డును అందుబాటులోకి తెస్తాం

- ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్



ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

**కదిరి, డిసెంబర్ 6 ప్రభాతవార్త**

కదిరి బైపాస్ రోడ్డులో వైసిపి నాయకులు ఎన్ని అవాంతరాలు సృష్టించినా ప్రజలకు బైపాస్‌ను అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కదిరి రూరల్ మండల పరిధిలోని కవులేపల్లి వద్ద నిర్మించిన ఫ్లైఓవర్‌ను ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ప్రారంభించారు. ఎమ్మెల్యే కందికుంటకు కూటమి నాయకులు క్రేన్‌తో భారీ గజమాల వేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ.. మారుతున్న ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం రహదారులను మెరుగు పర్చాలన్న ఉద్దేశ్యంతో లెవెల్ క్రాసింగ్ ఉండకూడదన్న ఉద్దేశ్యంతో ఫ్లైఓవర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. 2014-18 ప్రభుత్వ హయాంలో రెండు ఫ్లైఓవర్ బ్రిడ్జిలను రూ.56కోట్లతో మంజూరు చేసిందన్నారు. ఒకటి కవులేపల్లి, రెండవది కుటాగుల జోగన్నపేట వద్ద రైల్వే క్రాసింగ్ బ్రిడ్జి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో చిన్నచిన్న భూ సమస్యలు పరిష్కారం చేయలేక ఫ్లైఓవర్‌ను పూర్తి చేయలేకపోయారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలోనే భూ సమస్యలను పరిష్కరించి ఫ్లైఓవర్‌ను పూర్తి చేశామన్నారు. కుటాగుల వద్ద ఉన్న ఆర్ఓబికి కూడా కొన్ని చిక్కుముడులు ఉన్నాయని వాటని పరిష్కరించి త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఇందుకు సహకరించి క్రిష్ కంపెనీ సిబ్బందికి నియోజకవర్గ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. గత టిడిపి ప్రబుత్వ హయాంలో రూ.250 కోట్లతో బైపాస్‌ను నిర్మించి కదిరి పట్టణ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరుస్తామని, అనంతపురం రోడ్డులో వైసిపి నాయకులు కొన్ని అవాంతరాలు సృష్టిస్తున్నారని అవి తాత్కాలికమైనవని వాటిని అధిగమించి బైపాస్‌ను పూర్తి చేస్తామన్నారు. మా స్వలాభం, మా రాజకీయం, రాజకీయ లాభాపేక్షకంటే ప్రజల సౌకర్యార్థం కోసం ఆలోచనచేయాల్సిన బాధ్యత నాయకులపైన, రాజకీయ పార్టీలపైన ఎప్పుడు ఉంటుందని ఈ విషయాన్ని వైసిపి నాయకులు మరవ వద్దన్నారు. తిరుపతి పరకామణిలో చోరీ జరిగితే మాజీ ముఖ్యమంత్రి చిన్న చోరీ అని చెప్పడంపై ప్రజలు నవ్వుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్చాంధ్ర మిషన్ రాష్ట్ర డైరెక్టర్ పర్వీన్ భాను, టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, కౌన్సిలర్లు ఇస్మాయిల్, టిడిపి నాయకులు బావుద్దీన్, కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా డా.బి.ఆర్ అంబేద్కర్ 69 వ వర్ధంతి

- నివాళులర్పించిన పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, పీవీ కేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్‌రెడ్డి

**అనంతపురం, డిసెంబర్ 6 ప్రభాతవార్త బ్యూరో**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, పివికేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డిలు శనివారం పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ.. డా.బి.ఆర్ అంబేద్కర్ సమాజంలో సమానత్వం, న్యాయం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయన కుల నిర్మూలనకై, అట్టడుగు వర్గాల అభ్యున్నతికై జీవితాన్ని ధారపోసిన మహోన్నమైన వ్యక్తి డా.బి.ఆర్.అంబేద్కర్ అన్నారు. ఆయన ఆశయాలను మనం అంబేద్కర్‌ను స్మరించుకుంటూ దేశ ఆర్థిక వేత్తగా భారత రాజ్యాంగ నిర్మాతగా ఈ దేశానికి ఎనలేని సేవ చేసారని కొనియాడారు. భారతదేశం మొదటి న్యాయ కేంద్ర మంత్రిగా కూడా అంబేద్కర్ పనిచేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పీవీ కేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు, శ్రీకాంత్ రెడ్డి, మన్మధేశ్వర్ రెడ్డి, బండి రమేష్ బాబు, ధనంజయ రెడ్డి, నట శేఖర్, సంతోష్ కుమార్, వైభవ్, కళాశాల ఉద్యోగులు సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి


హోంగార్డులు విధులు అభినందనీయం - ఎస్పీ ఎస్.సతీష్ కుమార్

పోలీసుశాఖకు మంచిపేరు తీసుకొచ్చేలా సమిష్టి విధులు నిర్వర్తిద్దాం

అన్నదాతల ఆత్మహత్యలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి..! 4 >>

సత్యసాయి జిల్లా ను అగ్రస్థానంలో నిలిచేలా కృషి చేయండి

02ATP27_02ATP27.qxd 06-12-2025 PM 10:55 Page 1



## సీర్పి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం

బెలుగుప్ప, డిసెంబర్ 6 ప్రభాతవార్త


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బెళుగుప్ప మండలంలోని సీర్పి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం(104) విజిటెడ్ డా.రవి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు ఆరోగ్య చికిత్సలు భాగంగా బిపి, హెచ్‌బి చెక్ చేసుకోవడం, హై రిస్క్ గర్భిణీ స్త్రీలను హాస్పిటల్‌లోనే కాన్పు కావాలని, ఇంటిదగ్గర ప్రసవాలు కాకూడదని తెలియజేశారు. గర్భిణీ స్త్రీలకు టిడి, వెకేషన్, వ్యాధి నిరోధక టీకాలు, సంబంధించి అవగాహన కల్పించారు. రక్తపోటు, చక్కర వ్యాధి, వ్యాధిగ్రస్తులకు నెలసరి పడు మందులు ఇవ్వడం జరిగినది. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు టేక్ హోం రేషన్, బియ్యము, కంది బ్యాళ్లు, నూనె, బాల సంజీవని కిట్, కిట్‌లో ప్రతినెల సరిపడు, కోడిగుడ్లు, పాలు, చిక్కి, ఖర్జూరం, బెల్లం, అటుకులు, రాగి పిండి, డాక్టర్ ద్వారా పంపిణీ చేయడం, అంగన్వాడి కేంద్రంలో ప్రతినెల పంపిణీ చేయడం, గొంతు నొప్పి, దగ్గు, జలుబు, జ్వరాల సంబంధించి ముందస్తు జాగ్రత్తగా సలహాలు సూచనలు తీసుకోవాలని ప్రజలందరికీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డా.రవికుమార్, హెల్త్ సూపర్వైజర్ కె.వెంకటరమణ, ఎఎన్ఎం బి.రుక్మిణి, ఎంఎల్‌హెచ్‌పి, భార్గవి, హెల్త్ అసిస్టెంట్, గోవిందరాజులు, అంగన్వాడి వర్కర్స్, అనసూయమ్మ, కవిత, ఆశ వర్కర్ ఆదెమ్మ పాల్గొన్నారు.

## కంబదూరులో ఘనంగా అంబేద్కర్ వర్ధంతి

కంబదూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త


అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 69 వ వర్ధంతి సందర్భంగా కంబదూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి ఎస్సీ,ఎస్టీ పౌర హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు దొణతిమ్మ, ఉపాధ్యక్షుడు దాబా రమేష్, లీగల్ అడ్వైజర్ లాయర్ ఆంజనేయులు, నారాయణ, వంటారెడ్డి పల్లి నాగరాజు, హనుమంత రాయుడు, నారాయణ స్వామి,మహేష్, చెన్నంపల్లి గణేష్, కురాకులపల్లి ఆనంద్, తిమ్మ రాయుడు నరసింహమూర్తి, గోపి, శంకర్ ,సన్న, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహం చేయిని ధ్వంసం చేసిన ముద్దాయి అరెస్టు

కనేకల్లు డిసెంబర్ 06 ప్రభాతవార్త


మాట్లాడుతున్న సిఐ వెంకటరమణ ఎస్ఐ నాగ మధు

కనేకల్ మండల కేంద్రం బస్టాండ్ ఎదురుగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం యొక్క కుడి అరచేతిని పాక్షికంగా ధ్వంసం చేసిన ముద్దాయి అరెస్టు చేసిన పోలీసులు సందర్భంగా సిఐ వెంకటరమణ ఎస్ఐ నాగమధు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ కనేకల్ టౌన్ లో మెయిన్ రోడ్డు లో ఆర్‌టిసి బస్ స్టాండ్ వద్ద ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం యొక్క కుడి అరచేతిని కనేకల్ మండలము కలేకుర్తి గ్రామానికి చెందిన బోయ ధనుంజయ్య తండ్రి భీమన్న అను వ్యక్తి మద్యం త్రాగి మాజీ సీఎం విగ్రహం ను రాయి తో కొట్టగా విగ్రహం కుడి అరచేయి పాక్షికంగా డ్యామేజి అయినందున కనేకల్ మండల వైఎస్ఆర్ కాంగ్రెస్స్ పార్టీ కన్వీనర్ పాటిల్ బ్రాంహానంద రెడ్డి ఫిర్యాదు చేశారన్నారు. అతని పిర్యాదు కనేకల్ పోలీసు స్టేషన్ క్రైమ్ నంబరు 106/2025 గ్/స్ 324(2), 196(1) తీవిళీ గా కేసు నమోదు చేశామన్నారు.కేసు దర్యాప్తు చేపట్టి విచారించగా కనేకల్ మండలము కలేకుర్తి గ్రామానికి చెందిన బోయ ధనుంజయ్య అను వ్యక్తి మద్యం త్రాగి ఉండి, కనేకల్‌టౌన్ కు చెందిన వ్యక్తితో మాట్లాడుతూ, ఇద్దరి మధ్య మాటమాట పెరిగి, గొడవ ప్రారంభం కాగా, సదరు వ్యక్తి పక్కనే ఉన్న విగ్రహంను చూస్తూ తనతో మాట్లాడినందున ఉద్రేకం చెందిన బోయ ధనుంజయ్య ఒక్కసారిగా పక్కనే పడిఉన్న రాయి తీసుకొని విగ్రహం మెట్లుఎక్కి విగ్రహంను రాయితో కొట్టగా విగ్రహం కుడి అరచేయి పాక్షికంగా విరిగినదిఅని తెలిపారు. శనివారం ముద్దాయి బోయధనుంజయ్యను పూర్తిగా విచారించిన అనంతరము అరెస్టు చేసి రాయదుర్గం జుడీషియల్ మేజిస్ట్రేట్ వద్దకు రిమాండ్‌నిమిత్తం తరలించి చట్టపరమైనచర్యలు తీసుకున్నామన్నారు.

## యుటిఎఫ్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఎస్ ఎస్ సి విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ

### యూనియన్ బ్యాంక్ లోకేష్, మిత్ర బృందం ఆర్థిక సహాయంతో వితరణ

కళ్యాణదుర్గం డిసెంబర్ 6 ప్రభాతవార్త


విద్యార్థులకు పదవ తరగతి మోడల్ పేపర్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని బ్రహ్మసముద్రం మండలంలో అన్ని ఉన్నత పాఠశాలల్లోని కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిల్లో పదవ తరగతి చదువుతున్న 400 మంది విద్యార్థులకు రూ.32 వేల విలువచేసే మోడల్ పేపర్ల విద్యార్థులకు పంపిణీ చేశారు. యూనియన్ బ్యాంక్ ఉద్యోగి లోకేష్,మిత్ర బృందం లోని సాయిరాం రాజేష్ భాస్కర్ శ్రీనాథ్ నరహరి, యశ్వంత్, రవిఆర్థిక సహాయంతో ఎంఈఓ ఓబుళపతి చేతుల మీదుగా మోడల్ పేపర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎంఈఓ ఓబులపతి మాట్లాడుతూ మిత్రులు విద్యార్థులకు ఉపయోగపడటమే కాకుండా పరీక్షలలో మంచి మార్కులు సాధించేందుకు సాధనంగా మోడల్ పేపర్లను పంపిణీ చేయడం హర్షణీయమని అన్నారు. యుటిఎఫ్ మండల ప్రధానకార్యదర్శి సాయిరాం మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ పేపర్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థి దశలో కీలకమైన పదవ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడం వల్ల గొప్ప అవకాశాలను అందుకునే సంకల్పంతో ప్రతి సంవత్సరం బ్రహ్మసము ద్రం మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మోడల్ పేపర్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలోపాల్గొన్న పాఠశాలల ఉపాధ్యా యులు మాట్లాడుతూ మండలములోని 400 మంది విద్యార్థులకు రూ.32 వేల విలువచేసే ఎస్ఎస్సి మోడల్ పేపర్లు అందించడం ప్రశంసనీయమన్నా రు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణ కావాలని వెనుకబడిన బ్రహ్మసముద్రం మండల ఖ్యాతిని చాటి చెప్పాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్షుడు రామాంజనేయులు, కదరప్ప,శ్రీరాములు,అశోక్ కుమార్ పాఠశాల ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

## సమ సమాజ స్థాపకుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్

డి.హిరేహాళ్ డిసెంబరు 6 ప్రభాతవార్త


అంబేద్కర్ కు నివాళులర్పిస్తున్న దృశ్యం

సమ సమాజ స్థాపకుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని సర్పంచ్ గంగప్ప పేర్కొన్నారు. శనివారం డి.హిరేహాళ్ మండలం మురడిగ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి కార్యక్రమాన్ని సర్పంచ్ గ్రామ పెద్దలు, యువకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ ఆర్థిక సామాజిక అసమానతలను రూపుమాపిన మహానీయుడని ఆయన వర్ధంతిని జరుపుకోవడం మనందరికీ మహాభాగ్యమని ఆయన తెలిపారు. బాబా సాహెబ్ జీవితం ఆయన బోధనలు, ఆయన నేతృత్వంలో ఇచ్చిన రాజ్యాంగం తదితర అంశాలను స్మరించుకోవడం తమ ధర్మమని ఆయన తెలిపారు. బాబా సాహెబ్ కు విజ్ఞానాన్ని ఆర్జించేందుకు పేదరికం ఎలాంటి అడ్డంకులు లేవని ఆయన మనందరికీ ఆదర్శంగా నిలుస్తూ నిరూపించారని మానవులమైన మనం ఆయన అడుగుజాడల్లో నడుస్తూ విజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ బాబా సాహెబ్ అందించిన విజ్ఞానాన్ని ఆకళింపు చేసుకుంటూ తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం లో భీమ్ సేవా సమితి వ్యవస్థాపకులు ఎం. బసవరాజు, ఉలిగప్ప, భీమేష్ యేసప్ప, సంతోష్, భార్గవ్, పవన్, హనుమంత, పి.సంతోష్, కృష్ణమూర్తి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పొగాకుకు యువత దూరంగా ఉండాలి

### కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాణి ఎస్తేర్

బ్రహ్మసముద్రం డిసెంబర్ 6 ప్రభాతవార్త


పొగాకు వినియోగంపై వివరిస్తున్న దృశ్యం

జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆదేశాల మేరకు టోబాకో యూత్ కాంపెయిన్ 3.0 ను కోనాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ నందు ఘనంగా నిర్వహించారు. అక్టోబర్ 9 వ తేదీ నుండి డిసెంబర్ 08 వ తేదీ వరకు పొగాకు వాడకానికి వ్యతిరేకంగా ప్రజలలో ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఈ సందర్భంగా ఆమెతెలిపారు.ముందుగా గ్రామంలోనూ తర్వాత పాఠశాలలోనూ సిగరెట్టు మరియు ఇతర పొగాకు సంబంధింత ఉత్పత్తుల యొక్క వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. ప్రజలందరూ మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని పొగాకు మరియు వాటి ఉత్పత్తులకు దూరంగా ఉంటూ క్యాన్సర్ వంటి భయానక వ్యాధులు రాకుండా నివారించుకోవాలన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన వారందరి చేత పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. పొగాకు ఏ రూపంలో వాడినా అది మానవాళి ఆరోగ్యాన్ని క్షీణింప చేస్తుందన్నారు. ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యాసంస్థల పరిధిలో ఉన్న దుకాణాలలో సిగరెట్ ఇతర పొగాకు ఉత్పత్తులను అమ్మకూడదని తెలియజేశారు. అతిక్రమించిన వారిపై చట్టం ప్రకారం చర్య తీసుకోవడం జరుగుతుందన్నారు. పొగాకు వాడకానికి వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్, విద్యాశాఖ, ఎక్సైజ్, పంచాయతీరాజ్ , మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మొదలైన వారి సహకారంతో ఎన్ఫోర్స్మెంట్ డ్రైవ్స్ నిర్వహించాలని తెలియజేశారు.పర్యావరణాన్ని పొగాకు ఉత్పత్తుల వినియోగం నుండి రక్షించాలని అది అందరి బాధ్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జాన్సన్, ఎం ఎల్ హెచ్ పీ సల్మా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, ఉపాధ్యాయులు తిరుపాలు, హరి, బాలాజీ, ఆశా కార్యకర్తలు గీత, తిప్పక్క, కొల్లమ్మ, శివమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు శాంత కుమారి, అంజనమ్మ, పెన్నమ్మ మరియు ప్రజలు పాల్గొన్నారు.

## దివ్యాంగునికి కృత్రిమ కాలు అందించిన ఉపాధ్యాయులు బద్దే నాయక్

కళ్యాణదుర్గం రూరల్, డిసెంబర్ 6 ప్రభాతవార్త


దివ్యాంగునికి కృత్రిమ కాలు అందిస్తున్న దృశ్యం

రహదారి ప్రమా దబాధిత కుటుంబాలకు అండగా నిలబడి కృత్రిమ కాలును ఉపాధ్యాయులు ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ అందజేశారు. శనివారం స్థానిక ట్రస్ట్ కార్యాలయంలో కళ్యాణదుర్గం పట్టణంలోని గరీబ్ నగర్ కు చెందిన కార్తీక్ ఆటో ప్రమాదం లో ఒక కాలు పోగొట్టున్నాడు. దివ్యంగుడిగా నడవడానికి అందరితో కలిసి తిరిగేందుకు ఒకరి సాయంతోనే వెళ్లాల్సి వచ్చేది. అయితే అదే కాలనీలో అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం అందించేందుకు నెల క్రితం బద్దే నాయక్ వెళ్లగా అక్కడే బాధితుడు కార్తీక్ సమస్య విన్నవించగా స్పందించిన ఆయన కృత్రిమ కాలు అందిస్తానని హామీ ఇచ్చి నెల రోజులు గడవక ముందే బాధితుడు కార్తీక్ కు తన మిత్రుడు చైతన్య తో కలిసి వెళ్లి కృత్రిమ కాలు అందించారు. దీంతో కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. బాధిత కుటుంబ సభ్యులు పద్మావతి, కార్తీక్ లు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదం లో కాలు తీసివేయగా ఆసుపత్రి చికిత్స కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడ్డామని అడిగిన వెంటనే సాయం అందించారని బద్దే నాయక్ కు ఎప్పుడు రుణపడి ఉంటామన్నారు .కృత్రిమ కాలు అందించడమే కాకుండా మందులకు ఆర్థిక సాయం చేశారన్నారు.

## ఘనంగా బాబా సాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతి

శెట్టూరు, డిసెంబర్ 06 ప్రభాతవార్త


అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి 69వ వర్ధంతిని ఉమ్మడి జిల్లాలఉపాధ్యక్షులు టైగర్ వన్నూరుస్వామిమాదిగ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని నవభారత రాజ్యాంగ నిర్మాత, భారతదేశ దిశ దశ నిర్దేశించిన మహనీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...బడుగు బలహీన వర్గాలు రిజర్వేషన్ కోసం అంబేద్కర్ చేసిన పోరాటం మరువలేనిది. పేదవర్గాలు కొంత వరకు అభ్యున్నతిని సాదించారంటే అది అంబేద్కర్ వ్రాసిన రాజ్యాంగం వల్లనేనని అంబేద్కర్ లాంటి మేధావి భారత దేశంలో పుట్టడం గర్వకారణం. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడుడని భారతజాతి ఉన్నంత కాలం అంబేద్కర్ ను గౌరవించు కోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెస్ హనుమంతరాయుడు, దొడ్ల తిప్పేస్వామి, హరినాథ్ రెడ్డి ఆదిశేషయ్య లింగప్ప, చెవుల కిష్టప్ప, నరసింహులు, మాజీ సర్పంచ్ సిద్ధం రామిరెడ్డి, దళిత యువసేన ముఖ్య నాయకులు, పాల్గొని ఘన నివాళులర్పించడం జరిగింది.

## అంబేద్కర్ ఆశయ సాధన దిశగా కూటమి పాలన

### అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే కాలవ ఘన నివాళి

రాయదుర్గం రూరల్ డిసెంబర్ 6 ప్రభాతవార్త


అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నవసమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలు రూపుమాపడానికి భారత రాజ్యాంగ రూపకర్త మహనీయుడు బి ఆర్ అంబేద్కర్ ఎంతగానో కృషి చేశారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వెల్లడించారు. రాయదుర్గంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంబేద్కర్ జీవితం, ఆయన బోధనలు, ఆయన నేతృత్వంలో ఇచ్చిన రాజ్యాంగం, వీటన్నిటిని స్మరించుకోవడం మనందరి ధర్మమన్నారు. కడు పేదరికంలో పుట్టినా... విజ్ఞాన సముపార్జనకు అది అడ్డు కాదని నిరూపించిన గొప్ప నాయకుడు అంబేద్కర్ అన్నారు. ఆయన జీవితాన్ని గమనించినట్లయితే చదువుతోనే జ్ఞానం, వికాసం, అభివృద్ధి, చైతన్యం సాధ్యపడుతుందనేది మనందరికీ స్పష్టంగా బోధపడుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారంలో భాగం కల్పించడానికి ఆ మహనీయుడు చేసిన కృషి, పౌర సమాజ బాగు కోసం జీవితకాలం పడిన తపన, తాపత్రయము స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన చూపిన మార్గంలో రాష్ట్రంలో చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. బలహీన వర్గాలు, దళితులు, మైనార్టీలు అందరి బాగుకోసం అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. ముఖ్యంగా సామాజిక పెన్షన్లను పెద్ద ఎత్తున పంపిణీ చేస్తుండడం నిరుపేద కుటుంబాలకు గొప్ప ఆలంబనగా నిలుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలే అంబేద్కర్ కి ఘనమైన నివాళని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలు తగ్గే విధంగా చంద్రబాబు ప్రభుత్వం మరింత గొప్పగా పనిచేస్తుందని బలహీన వర్గాల అందరికీ భరోసా ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు కురుబ హనుమంతు, కౌన్సిలర్ ప్రశాంతి, బండి భారతి, పోరాళ్ల పురుషోత్తం,చిన్ని కృష్ణ ,గ్యాస్ కృష్ణ, మల్లి,రామంజి తదితరులు పాల్గొన్నారు.

## స్క్రబ్ టైఫస్ వ్యాధి కలకలం

హిందూపురం టౌన్ డిసెంబర్ 06 ప్రభాతవార్త


చిన్నారికి వైద్యం చేస్తున్న డాక్టర్

హిందూపురంలో స్క్రబ్ టైపస్ వ్యాధి కలకలం రేపింది చిలమత్తూరు మండలానికి చెందిన ఒక బాలుడికి ఈ వ్యాధి సోకడంతో శనివారం తల్లిదండ్రులు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్య పరీక్షల నిర్వహించిన అనంతరం ఇది స్క్రబ్ టైపస్ వ్యాధి అని వైద్యులు నిర్ధారించారు. వరి పొలాల్లో ఉండే పురుగులు కొట్టడం వల్లే ఈ వ్యాధి సోకుతుందని వైద్యులు తెలిపారు. శరీరంపై దద్దుర్లు, జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఈసందర్భంగా ఆసుపత్రి సూపర్డెంట్ అన్నపూర్ణ మాట్లాడుతూ కొత్తగా వచ్చిన స్క్రబ్ టైపస్ వ్యాధి అక్కడక్కడ వ్యాప్తి చెందుతుందని హిందూపురంలో కూడా ఒక కేసు నమోదు కావడం జరిగిందని తెలిపారు. హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో ఈ వ్యాధి గ్రహస్థులకు ప్రత్యేకంగా పది పడకలు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

## గ్రంథాలయంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు

చిలమత్తూరు, డిసెంబర్ 6 ప్రభాతవార్త


అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

చిలమత్తూరు శాఖ గ్రంథాలయంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి "మహాపరి నిర్వాన్ దినోత్సవాన్ని" గ్రంథాలయ అధికారి ఆర్.మల్లికార్జున ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ అధికారి ఆర్.మల్లికార్జున మాట్లాడుతూ పీడిత ప్రజల హక్కుల ఉద్యమ సూరీడు అస్తమించిన రోజును గుర్తు చేసుకుంటూ భారత దేశంలో కొనసాగుతున్న అనాగరిక వ్యవస్థలపై అంతర్జాతీయ వేదికలపై గళమెత్తిన మేధావిగా, కులం, మతం పేరుతో ఈ దేశ మూలవాసులపై అరాచకాలు అణచివేతలపై తిరుగుబాటు చేసిన దీరుడు అంబేద్కర్ అని అభివర్ణించారు. తన జీవితాన్ని ప్రజల హక్కుల సాధన కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. 1956 డిసెంబర్ 6న ఆయన తుది శ్వాస విడిచారని, అయన వర్ధంతిని మహాపరినిర్వాన్ దివాస్‌గా పిలుస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆర్.మల్లికార్జున, గ్రంథాలయ పాఠకులు నరసింహమూర్తి, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నేటి యువత అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

లేపాక్షి, డిసెంబర్ 6 ప్రభాతవార్త


అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

నేటి యువత అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని టిడిపి మండల కన్వీనర్ అభిలాష్, మాజీ ఎంపిపి ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్ర మైన లేపాక్షిలో అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిరస్మరణీయుడన్నారు. అన్ని వర్గాలకు, మతాలకు అతీతంగా రాజ్యాంగ రచన చేపట్టిన మహోన్నత వ్యక్తి అన్నారు. బాల్యంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా విద్యాభ్యాసాన్ని కొనసాగించి ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. అంబేద్కర్ జీవితం అందరికీ ఆదర్శనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండలాధ్యక్షుడు నరసింహమూర్తి, జనసేన మండల అధ్యక్షుడు బాలాజీ, టిడిపి నాయకులు మాజీ జెడ్‌పిటిసి రామాంజనమ్మ, సిరివారం కిష్టప్ప, గోవిందు, డిష్ మంజు, గనిబిపల్లి శివశంకర్, డైరీ శ్రీరామప్ప, సిటీ ఆంజనేయులు, అంగడి అంజి, చంద్రశేఖర్‌గౌడ్, బయన్నపల్లి రవి, ఎన్.బి.కె మూర్తి, అనిల్‌కుమార్, మానేపల్లి నారాయణ, హోటల్ బన, ఆదినారాయణ, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా లక్ష్మీనరసింహస్వామి పల్లకీ ఉత్సవం

ఉరవకొండ, డిసెంబరు 6 ప్రభాతవార్త


లక్ష్మీనరసింహస్వామి పల్లకీ ఉత్సవం దృశ్యం

జిల్లాలో ప్రసిద్ధ చెందిన ఉరవకొండ మండలం పెన్నహోబిళంలో వెలసిన లక్ష్మీనరసింహాస్వామి దేవస్థానంలో స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం మార్గశిర విదియ శనివారం సాయంత్రం సాంప్రదాయం ప్రకారం లక్ష్మీనరసింహ స్వామి పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీరి చ్చగా ప్రధానాలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. మార్గశిర మాసం కావడంతో జిల్లా నలుమూలల నుండే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు, పర్యాటకులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బైక్ రైడర్స్ కు తల్లిదండ్రుల సమక్షంలో ఎస్పీ సతీష్ కుమార్ కౌన్సిలింగ్

### రికార్డులు పరిశీలించి జరిమానా విధించిన అధికారులు మళ్లీ బైక్ రైడింగ్ కు పాల్పడితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించిన ఎస్పీ.

పెనుకొండ డిసెంబర్ 6 (ప్రభాతవార్త)



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ


బైక్ రైడర్స్‌కు వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్పీ

పెనుకొండలో జరిగిన ఉరుసు సందర్భంగా పెనుకొండ జాతీయ రహదారిపై ప్రమాదకర విన్యాసాలు చేస్తున్న బైక్ రైడర్స్ కు వారి తల్లిదండ్రుల సమక్షంలో శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ కౌన్సిలింగ్ నిర్వహించారు. శనివారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం నందు జిల్లా ఎస్పీ పెనుకొండ డిఎస్పి నర్సింగప్ప తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెనుకొండ జాతీయ రహదారిపై ఉరుసు సందర్భంగా ప్రమాదకర విన్యాసాలు చేస్తున్న ద్విచక్ర వాహనదారుల 102 వాహనాలను స్పెషల్ టీం పోలీసులు సీజ్ చేయడం జరిగిందన్నారు. బైక్ రైడింగ్ కు పాల్పడిన వారి తల్లిదండ్రులకు, బైక్ రైడర్స్ కు కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగిందని, పట్టుబడిన బైక్ ల రికార్డ్స్ ఆర్టీవో కార్యాలయం అధికారులతో పరిశీలించి హిందూపూర్ వెహికల్ ఇన్స్పెక్టర్ సమక్షంలో జరిమానాలు విధించడం జరిగిందన్నారు. కౌన్సిల్ సమయంలో ఎస్పీ మాట్లాడుతూ ఇది మొట్టమొదటి తప్పుగా క్షమించి జరిమానాలతో సరిపెట్టుతున్నామని, మరొకసారి బైక్ రైడింగ్లకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, బైక్ రైడింగ్ చేసిన వాహనాలను సీజ్ చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. పట్టుబడిన బైక్ లు ఎక్కువ శాతం కర్ణాటక ప్రాంతానికి చెందినవి అని తెలిపారు. మొత్తం బైకులు అన్నింటి పైన దాదాపు 7లక్షల రూపాయల వరకు జరిమానాలు విధించినట్లు తెలిపారు.విలేకరుల సమావేశంలో డి.ఎస్.పి నర్సింగప్ప, సిఐ రాఘవన్, ఎస్సైలు వెంకటేశులు, రమేష్ బాబు,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళ హత్య కేసులో నిందితులు అరెస్ట్

### -బంగారు ఆభరణాల కోసం హత్య -డిఎస్‌పి శ్రీనివాసులు

గుత్తి, డిసెంబర్ 6 ప్రభాతవార్త


నిందితులను అరెస్టు చేసిన దృశ్యం

గుత్తి అర్బన్ సర్కిల్ పరిధిలో దాదాపుగా ఐదు సంవత్సరాల నుండి ఎటువంటి హత్య కేసు నమోదు కాని నేపథ్యంలో ఇటీవల హత్యకు గురైన ఓ మహిళ హత్యకేసును ఎట్టకేలకు పోలీసులు ఛేదించారు. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న గుంతకల్లు డిఎస్‌పి శ్రీనివాసులు, అర్బన్ సిఐ రామారావు ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బంది మమ్మురంగా దర్యాప్తు చేపట్టి ఇరువురు నిందితులను అరెస్ట్‌చేశారు. శనివారం సిఐకార్యాలయంలో ఏర్పా టుచేసిన విలేకరులసమావేశంలో గుంతకల్లు డిఎస్‌పివివరాలు వెల్లడించారు. గుత్తి ఆర్ఎస్‌లో నివాసముండే విజయలక్ష్మి అలియాస్ రెడ్డమ్మ అనే మహిళకు చెందిన గుడ్‌షఫర్డ్ స్కూల్ ఎదురుగా వున్న ఇంటిలో బంధాల రాము, అతని భార్య అలీషా అద్దెకు నివాసముండేవారని డిఎస్‌పి తెలిపారు. ఆమె ఒంటి మీద ఉండే బంగారు ఆభరణాల కోసం కుట్రతో ఆ దంపతులు విజయలక్ష్మికి సంబంధించిన పొలానికి రప్పించి, గొంతు నులిపి, హత్య చేసి ఆమెఒంటిపైఉన్న బంగారు చైన్, కమ్మలు, సెల్ ఫోన్ అపహరించారన్నారు. తదుపరి ఆమె మృతదేహాన్ని ఆటోలో తీసుకువెళ్లి గుట్టుచప్పుడు కాకుండా గుంతకల్లు రూరల్ మండలం ఎర్రతిమ్మరాయుని చెరువులో పడవేశారన్నారు. తదుపరి ఆమె బంగారాన్ని ఓ ప్రైవేట్ ఫైనాన్సులో తాకట్టు పెట్టి, సొమ్ము చేసుకున్నారని ఆయన తెలిపారు. జిల్లా ఎస్‌పిజగదీష్ ఆదేశాల మేరకు తమ సిబ్బందితో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశామని ఆయన తెలిపారు. నిందితులు మృతదేహాన్ని తరలించిన ఆటోతో పాటు, రెండు సెల్ ఫోన్లు, బంగారు కమ్మలను స్వాధీన పరుచుకొని వారిని అరెస్ట్ చేశామని డిఎస్‌పి వివరించారు.. గతంలో సదరు నిందితులు చిన్న మారాజు అనే వ్యక్తి ఇంట్లో అద్దెకు ఉంటూ అతడి భార్య విజయలక్ష్మి వద్ద బంగారం అపహరించి తాకట్టుపెట్టి సొమ్ము చేసుకున్నారని వివరించారు. హత్య కేసును ఛేదించేందుకు కృషి చేసిన సిబ్బందిని డిఎస్‌పి అభినందించారు.

## అంతరించిపోతున్న కోలాటం కళకు జీవం

కుందుర్పి, డిసెంబర్ 6, ప్రభాతవార్త


బోయ జయన్నను సన్మానిస్తున్న దృశ్యం

కుందుర్పి మండలం అపిలేపల్లి గ్రామంలో నివాసముంటున్న 72 సంవత్సరాలు వయస్సు కలిగిన బోయ జయన్న అనే వ్యక్తి అంతరించిపోతున్న కోలాటం కళకు జీవం పోస్తున్నాడు. గ్రామాల్లో పేరుగాంచిన కోలన్న ఆటను జయన్న మనువడు, మనవరాల్లతో పాటు పలువురికి నేర్పిస్తూ అందరి మన్ననలను పొందుతున్నాడు. నిన్నటి రోజున పాఠశాల ఆవరణంలో జరిగిన మెగా పిటిఎం సందర్భంగా పిల్లలు, గ్రామస్తులు కోలన్నను ఆడడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిమ్మప్ప, స్కూల్ కమిటీ చైర్మన్ మారుతి, మాజీ సర్పంచ్ డీలర్ ఓబులేష్ ఆయనను అభినందిస్తూ ఘనంగా సన్మానించారు.

## దార్శనీయునికి ఘన నివాళి

- ఘనంగా అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలు



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**రాప్తాడు, డిసెంబర్ 6 ప్రభాతవార్త**

భారత రాజ్యాంగ రూపకర్త బడుగు బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత మనువాద రక్కసిని కూకటి వేళ్ళతో పెకిలించిన సైద్ధాంతిక వేత దర్శనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోనే అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వతంత్ర కుమారి మాట్లాడుతూ.. సామాజిక సమానత్వం దళితుల హక్కుల కై ఉద్యమించిన నేత ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ రూపకర్త బడుగు బలహీన వర్గాల దర్శనీయుడు డాక్టర్ భీంరావు అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయనకు ఘన నివాళులు సమర్పించడం ఆయన స్ఫూర్తిగా నడవటం సంతోషదాయకమని అన్నారు. ఒక ఎస్సీ, ఎస్టీలకు కాకుండా భారత దేశంలో ఉన్నటువంటి ప్రతి ఒక్క భారత పౌరులకు రాజ్యాంగాలను చట్ట సభలలో ఏర్పాటు చేసి భారతదేశంలో రాజ్యాంగ చట్టాలను అమలులోకి తీసుకురావాలని వాటి పట్ల ప్రతి ఒక్కరూ ప్రతి ఒక్క ఉద్యోగులు, రాజకీయ నాయకులు కూడా రాజ్యాంగ నిర్మాత పెట్టిన రాజ్యాంగాన్ని అమలు చేసే ప్రయత్నాలలో భారతీయులు ప్రతి ఒక్కరు కూడా ఐకమత్యంతో ఉండి అమలులోకి తెచ్చుకోవాలని వాటిని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిగ నాగేంద్ర, మాదిగ పెద్దరాజు, జన మాదిగ, మారుతి మాదిగ, సుబ్బమ్మ,పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ 2025 పరీక్షకు సంబంధించిన ఓరియంటల్ మీటింగ్



సమావేశాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 6 ప్రభాతవార్త**

ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహజంచిన ఓరియంటేషన్ సమావేశానికి సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ డిపార్ట్మెంటల్ ఆఫీసర్ హాజరయ్యారు. ఈ మీటింగ్‌కు ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ శ్రీనివాసులు, మల్లారెడ్డి, హాస్టల్ కమిషనర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ అటెండ్ అయ్యారు. ఎన్.ఎం.ఎం.ఎస్ ఎగ్జామినేషన్ విద్యార్థులు ఒక గంట ముందుగానే పరీక్ష సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు. సజావుగా జరగడానికి అన్ని చర్యలు తీసుకున్నామని తెలియజేశారు.

## జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీమ్ రావు అంబేద్కర్ వర్ధంతి



వర్ధంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 6 ప్రభాతవార్త**

జాయింట్ కలెక్టర్, పర్సన్ ఇంచార్జ్, జిల్లా గ్రంథాలయ సంస్థ శివ నారాయణ శర్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ అనంతపురం అధ్వర్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయం అనంతపురంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్బంగా శనివారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా కార్యదర్శి పి.రమ మాట్లాడుతూ.. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాతగా దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పి.కమ్మన్న, సహ గ్రంథాయాలాధికారి డి.గోవిందు, బాలచంద్ర, జీవన, జి.ఎమ్, బాషా, గంగాధర్ మొదలగు వారు మోక్షిత్ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

## రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులు

**బుక్కరాయసముద్రం డిశంబర్ 6 ప్రభాతవార్త**



అంబేద్కర్ కు నివాళలర్పిస్తున్న దళిత ప్రజా సంఘాల నాయకులు

సమాజానికి న్యాయం, సమానత్వం, స్వాతంత్రం అందించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవితం ఒక మహాగ్రంథం అని పలువురు రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు,దళిత ప్రజా సంఘాల నాయకులు మేదావులు అన్నారు.శనివారం బుక్కరాయ సముద్రం మండల కేంద్రంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్బంగ ఆయన విగ్రహానికి పూలమాళలు వేసి నివాళలర్పించారు. నివాళలర్పించిన వారిలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మాజీ జడ్పిటీసి కాటెప్పగారి రామలింగారెడ్డి,సిఐ పుల్లయ్య,తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి,తోపాటు దళిత ప్రజా సంఘాల నాయకులు డప్పుల వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు పూలమాళలు వేసి నివాళలర్పించారు.ఈ కార్యక్రమంలో బికెయస్ ఆనంద్,కెపి నారాయణస్వామి, వెంకటాపురం చంద్ర, నాగభూషణ, చిన్నపెద్దన్న,మురూరు చిన్న,నామాల నల్లప్ప,రాజు,దాసిగానికుళ్ళాయప్ప, గొల్లపల్లి రామాంజినేయులు,తోపాటు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి డా.బి.ఆర్.అంబేద్కర్

**అనంతపురం, డిసెంబరు 06, ప్రభాతవార్త**



అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరామయ్య తదితరులు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అని ఏకలవ్య ట్రైబ స్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు వై.వెంకటరామయ్య పేర్కొన్నాడు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఎదురుగా వున్న డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించాడు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ నగర అధ్యక్షుడు జి.మనోహర్‌తో పాటు నాయకులు సాకే శ్రీనివాసులు, గుజ్జల నారాయణ, ఆది, జి.పి.ఎస్.ఎస్. రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున నాయక్ పాల్గొన్నారు.

## రుషిస్సంగ మహా ముని జ్ఞాపకార్థం అన్నదానం



ఉప్పర మధు కుటుంబ సభ్యులకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

**శింగనమల, డిసెంబర్ 6 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని శింగనమల మరువ కొమ్మ వద్ద రుషి స్పంగ మహాముని శ్రీ రంగరాయల వారి జ్ఞాపకార్థం 23వ వారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినేట్లు రామ్‌చరణ్ యాదవ్ పేర్కొన్నారు. ఉప్పర రామచంద్ర, ఉప్పర మధు, ఉప్పర రామాంజి తమ ఇంటి దేవుడైన రుషి స్పంగమహాముని జ్ఞాపకార్థం స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి వచ్చిన భక్తాదులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు శాలువాతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని అనేక గ్రామాల నుంచి స్వామివారి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ వర్ధంతి వేడుకలు

**నంబులపూలకుంట, డిసెంబర్ 6 ప్రభాతవార్త**

డా.బిఆర్ 69వ వర్ధంతి వేడుకలను నంబులపలూలకంట మండల కేంద్రంలో శుక్రవారం ఎంపిడిఓ ఆర్.పార్థసారధి, గ్రామస్తులు, బాజాపా, వైకాపా నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాజాపా నాయకులు కాసేటి రామ్మోహన్ మాట్లాడుతూ.. డా.బిఆర్.అంబేద్కర్ ఆశయాలను గుర్తు చేశారు. వైకాపా మండల కన్వీనర్ రంగారెడ్డి, కార్యకర్తలు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ 69వ వర్ధంతి కార్యక్రమం



ఎస్సై మహమ్మద్ గౌస్ కి అంబేద్కర్ చిత్రపటాన్ని ప్రజా సంఘాల నాయకులు అందజేస్తున్న దృశ్యం...

**గార్లదిన్నె డిసెంబర్ 06ప్రభాత వార్త**

దేశ దిశా మార్గదర్శి, భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా గార్లదిన్నె మండల కేంద్రంలో ఎస్సి,ఎస్టీ ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గార్లదిన్నె సబ్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ గౌస్, ట్రైనింగ్ ఎస్సై సురేంద్రబాబు హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ అంటరానితనం నిర్మూలనకు, అట్టడుగు వర్గాల ఎదుగుదలకు అంబేద్కర్ గారి సేవలు అపారమైనవి. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలి అని అన్నారు.ఎస్సి, ఎస్టీ ప్రజా సంఘాల నాయకులు ఎస్సైకి అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరించారు.కార్యక్రమంలో ఎస్సి, ఎస్టీ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ డి.రవిరాజ్, ఏపీఎం మల్లికార్జున, డ్వాక్రా సీసీ రామాంజనేయులు,జిల్లా ఆదర్శ రైతు జయరాజ్, ఎంఆర్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.కదిరెప్ప, వైస్సార్ నాయకులు వనమాల నాగరాజు, వికలాంగుల జిల్లా అధ్యక్షుడు పుల్లన్న, డప్పు కళాకారుల జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కొప్పుల కొండ వెంకటేష్, జైభీం పార్టీ వ్యవస్థాపకులు రామాంజనేయులు, ఓబిలేసు, జంబులదిన్నె కొట్టాల రామాంజి నేయులు, జంబులదిన్నె కుంటి ఆంజనేయులు, జంబులదిన్నె రవి, కనుంపల్లి గోపాల్,బూదేడు ఓబుళపతి, నల్లప్ప, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## మా ఆలయ అభివృద్ధికి సహకరించండి

- దేవుని విషయంలో రాజకీయాలు వద్దు



పూజారి, గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ కౌలుట్లయ్య

**శింగనమల, డిసెంబర్ 6 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద దుర్గాంజినేయస్వామి కొండపై వెలిసిన మా ఆలయం అభివృద్ధికి సహకరించాలని, దేవుని విషయంలో రాజకీయాలు వద్దని శింగనమల గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పూజారిని కోరారు. శనివారం గ్రామస్తులు కమిటీ సభ్యులు మండలంలోని పెద్ద మనుషులు దుర్గాంజినేయస్వామి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు పూజారితో మాట్లాడుతూ.. గత కొద్ది సంవత్సరాల నుంచి స్వామివారి ప్రాంగణంలో ముల్లపొదలు, చెత్తా చెదారం ఎక్కువగా ఉందని, తాము తొలగించేందుకు ప్రయత్నిస్తుంటే మీరు ఒక పూజారిగా సోషల్ మీడియాలో ఆపాలని ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని ప్రకటించడం రాజకీయం చేయడమేనని, దయచేసి రాజకీయాలకు అతీతంగా స్వామివారి పూజా కార్యక్రమంలో మాత్రమే పాల్గొనాలని అభివృద్ధి పనులు గ్రామస్తులు చేసుకుంటారని ఆయనకు తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే గ్రామస్తులతో కలిసి కూర్చుని చర్చించుకుని సమస్యను పరిష్కరించుకోవాలని సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్, పూజారికి, గ్రామస్తులకు తెలిపారు.

## రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

**బుక్కరాయసముద్రం డిశంబర్ 6 ప్రభాతవార్త**

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి ఆయన 69వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు.సందర్భంగా ఏపీ గ్రామపంచాయితీ వర్కర్స్ యూనియన్,కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, రైతు సంఘం జిల్లా నాయకులు కుళ్ళాయప్ప,ఏపి గ్రామపంచాయితీ వర్కర్స్ యూనియనన గౌరవాధ్యక్షులు ఎర్రకొండప్ప, నాయకులు ఎర్నాగయ్య,సుబ్రహ్మణ్యం, చిన్నాంజనేయులు, నాగేంద్ర, నాగరాజు, రామాంజనేయులు, వెంకటమ్మ, పవిత్ర, విజయ్, సుధాకర్, ఓబులేసు, పవన్,కళ్యాణ్,నాగేంద్ర,నగేష్ తదితిరులు పాల్గొన్నారు.ఈ సందర్బంగా నాయకులు మాట్లడుతూ బిఆర్ అంబేద్కర్ దేశ ప్రజానీకానికి రాజ్యాంగం ద్వారా అనేక హక్కులను బాధ్యతలను ఇచ్చారని నోరులేనివారికి నోరై కార్మికుల హక్కులను చట్టంద్వారా కల్పించారని కనీస వేతనాలు ఇతర కార్మిక హక్కులను రాజ్యాంగం ద్వారా ఇచ్చారన్నారు. అంబేద్కర్ ఏ ఒక్క కులానికి చెందినవాడు కాదని సమాజంలో ఉన్న అన్ని వర్గాలకి కులాలకి రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పించారు, కొందరివాడు కాదు అందరివాడు. గ్రామ పంచాయితీ కార్మికులకు కనీస వేతనాలు పిఎఫ్, ఈఎస్ఐ,ఈ హెచ్ఎస్ అమలు చేయాలని కోరారు.అంబేద్కర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళలర్పిస్తున్న నాయకులు

## రెజ్లింగ్ శ్రీహర్ష విజేతకు ఘన సన్మానం



రెజ్లింగ్ శ్రీహర్షను సన్మానిస్తున్న దృశ్యం

**అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 6 ప్రభాతవార్త**

మొన్న చిత్తూరు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలలో బంగారు పతకం సాధించిన రెజ్లింగ్ శ్రీహర్షను ఏపీ స్టూడెంట్ జేఏసీ నేతలు ఘనంగా సన్మానించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. నార్పల మండలానికి చెందిన బాల శ్రీ హర్ష బంగారు పతకం సాధించడం జిల్లాకు గర్వకారణం అన్నారు. ఈనెల 11, 12, 13 వ తేదీలలో గుజరాత్‌లో జరిగే అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీలలో హర్ష ఎంపికయ్యారని జాతీయ స్థాయిలో కూడా రెజ్లింగ్‌లో రాణించాలని కోరుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత కార్యదర్శి సుధాకర్, విద్యార్థి జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్, రాజేష్, విజయ్, వాల్మీకి ప్రసాద్,హాస్టల్ విజయ్,రామకృష్ణుడు పాల్గొన్నారు.

## రాజ్యాంగ స్ఫూర్తిని కునసాగిద్దాం

- జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ

**అనంతపురం సిటీ, డిసెంబర్ 6 ప్రభాతవార్త**

ప్రతి ఉద్యోగి రాజ్యాంగ బద్దంగా పని చేయడమే కాకుండా రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించాలని జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ సూచించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ సిబ్బందితో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ.. డా.బిఆర్.అంబేద్కర్ రచించిన రాజా్యంగం వల్ల నేడు సమానత్వం సాధ్యమవుతూ అన్ని వర్గాలకు మేలు చేకూరుతోందన్నారు. ఆయన చూపిన మార్గంలో పయనించడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సిఇఓ వెంకట సుబ్బయ్య, ఏఓలు విజయభాస్కర్‌రెడ్డి, లెక్కల శ్రీనివాసులు, నందకిషోర్, ముత్యాలు రెడ్డిలతోపాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందించిన నేతలు

- మైనార్టీ కుటుంబానికి అండగా నిలిచిన రోటరీ క్లబ్



చిన్నారులకు విద్యా సామాగ్రిని అందిస్తున్న నేతలు

**అనంతపురం సిటీ, డిసెంబర్ 6 ప్రభాతవార్త**

దీర్ఘకాలికంగా పక్షవాతంతో బాధపడుతున్న మైనార్టీ మహిళా కుటుంబానికి రోటరీ క్లబ్ ఆర్థిక సాయాన్ని అందించారు. నగరంలోని అరుణోదయ కాలనీకి చెందిన పర్వీన్ దీర్ఘకాలంగా పక్షవాతంతో బాధపడుతుండటం ఆమెకు పింఛన్, రేషన్‌కార్డు కూడా లేక పోవడాన్ని స్థానికులు రోటరీ క్లబ్ సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన రోటరీ క్లబ్ సభ్యులు, మాజీ ప్రిన్సిపాల్ కల్లూరి ఆనందరావు, తమ కుమార్తె చైతన్య జన్మదినాన్ని పురస్కరించుకుని పర్వీన్ కుటుంబానికి రూ.10వేలు విలువైన నిత్యావసర సరుకులతోపాటు ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. అదే విధంగా ముత్యాలమ్మ కాలనీ, మహాదేవ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన పలకలు, ఇతరాత్ర విద్యా సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు గల్లా హర్ష, దంత వైద్యుడు ఎస్ఎస్‌వి, సీనియర్ సభ్యులుల శాంతరాజ్, థెరిస్సారాజ్, బిజెపి మైనార్టీ మోర్చ రాష్ట్ర నాయకులు మహ్మద్ రఫిక్, ఫాస్టర్ జోసెఫ్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ కల్లూరు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- చీఫ్ సెక్రెటరీని కోరిన సంఘం నేతలు



చీఫ్ సెక్రెటరీకి వినతిపత్రం అందిస్తున్న జెఎన్‌టియుఏ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

**అనంతపురం సిటీ, డిసెంబర్ 6 ప్రభాతవార్త**

జెఎన్‌టియుఏలో పరిధిలోపని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను ఆ సంఘం నేతలు కోరారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను జెఎన్‌టియుఏ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘం నేతలు శనివారం కలిశారు. ఈ సందర్భంగా జెఎన్‌టియుఏలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణతో పాటు పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. ఆయా సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని సిఎస్ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ అసోషియేషన్ ప్రెసిడెంట్ శిరీష్‌రెడ్డి, కార్యదర్శి వెంకటరాముడు, ఉపాధ్యక్షులు కృష్ణయ్య, కన్వీనర్ దివాకర్, ఇసి సభ్యులు వెంకటరాముడు, మధుసూధన్‌రెడ్డి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి బిఆర్ అంబేద్కర్

**నార్పల డిసెంబర్ 06, ప్రభాతవార్త**

భారత రాజ్యాంగ నిర్మాత, డా.బి.ఆర్. అంబేద్కర్ గారి జీవితం ఆదర్శనీయమని నార్పల మండల ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం పేర్కొన్నారు. భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 69వ వర్ధంతి సందర్భంగా గ్రామ పంచాయతీ ఆవరణలో ఉన్న పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగన్ని రచించి బడుగు బలహీన వర్గాలకు, అన్ని వర్గాల ప్రజలకు ఆయన సూచనలు మార్గదర్శనమ్మన్నారు. ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాలకు ఎంతో అండగా నిలిచారన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మీనుగ రామాంజనేయులు,హనుమంతు, గణేష్, పవన్, సిపిఐ కుల్లాయప్ప పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడుఆధ్వర్యంలో

## ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం.

**అనంతపురం రూరల్, డిసెంబర్ 06ప్రభాతవార్త**

అనంతనగరంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి 69వ వర్ధంతి వేడుకలను మాల మహానాడు నాయకులు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అన్ని కులాల సమానత్వాన్ని కోరుకున్నటువంటి వ్యక్తి అందరికీ రాజ్యాంగాన్ని రూపకల్పన చేసిన వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని సమసమాజ అభ్యున్నతికి పాటుపడ్డాడని ఆయన చేసిన త్యాగాలు వలన బడుగు బలహీన వర్గాలు సమాజానికి దీటుగా జీవనం జీవనం సాగిస్తున్నారని, అదేవిధంగా ఆయన మొట్టమొదటి న్యాయశాఖ మంత్రిగా పనిచేశారని తెలియజేశారు. మాలమహానాడుఅనంతపురం మరియు సత్య సాయి జిల్లా ల అధ్యక్షులు సుగామంచి శ్రీనివాసులు జిల్లా ప్రధాన కార్యదర్శి పూలకుంట చియ్యేడు రాము జిల్లా కార్యదర్శి నీలూరు సురేష్ బాబు,రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దళిత రత్న ఎస్ కె ఓబులేసు, అనంతపురం నగర అధ్యక్షులు మాల సత్య,నగర కార్యదర్శి సలవధిజయరాం,రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షులు కర్నాటి విజయ్‌కుమార్,మున్నానగర్ ఉరుములు తిరుపాల్ పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎంపీటీసీ మహబూబ్ బీ



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్, డిసెంబర్ 06 ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలం రుద్రంపేట గ్రామ పంచాయతీకి చెందిన మద్దన్న కుమార్తె వివాహము అనంతపురంలోని శిల్పారామంలో శనివారం నిర్వహించగా ఈ వివాహ వేడుకలలో ఎంపీటీసీ మహబూబ్ బీ స్థానిక నాయకులతో కలిసి పాల్గొని నూతన వధు వరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎం ఎస్ ఎస్ సేవా సంస్థ అధ్యక్షులు సాదిక్ వలి పాల్గొన్నారు.

## అయ్యప్ప దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**అనంతపురం కల్చరల్, డిసెంబర్ 6 ప్రభాతవార్త**



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నగరంలోని పాత ఊరు చెరువు కట్టపై వెలసిన అఖిలాండకోటి బ్రహ్మాండ నాయక హరి హర పుత్ర అయ్యప్ప స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో నుంచి ప్రారంభమైన స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు శబరిమల ప్రధాన అర్చకులు రాజీవ్ తంత్రి శిష్య బృందంచే జండా ప్రతిష్ట పూజా కార్యక్రమం నిర్వహించారు. జండా ప్రతిష్ట సందర్భంగా ఆకాశంలో దేవేంద్రుని రూపంలో గరుడ పక్షి రావడం.. అయ్యప్ప స్వామి భక్తాదులందరూ ఆనందోత్సాహాలతో తిలకించారు. ఈ బ్రహ్మోత్సవాలు ఈనెల 10వ తేదీతో ముగుస్తాయని కమిటీ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తాత్కాలిక అధ్యక్షులు గజేంద్రమోహన్, కమిటీ సభ్యులు కేశవ, రాము, రామకృష్ణ, అమర్నాథ్ రెడ్డి, వెంకటప్రసాద్, కాంతారెడ్డి, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## దేశం గర్వించదగ్గ నాయకుల్లో అంబేద్కర్ ఒకరు

**పామిడి, డిసెంబర్ 06 ప్రభాతవార్త**



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మునగల రంగనాయకులు

పేదవారు దనికులు అందరూ సమానమే అని కుల మత వర్గ బేధాలు లేకుండా రాజ్యాంగంలో ఓటు హక్కును పొందుపరిచిన అంబేద్కర్ దేశం గర్వించదగ్గ నాయకుల్లో ఒకరిగా నిలిచారని బిఎస్పీ వైసీపీ దళిత ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. భాతర రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధింతిని పురష్కరించుకుని శనివారం పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా బిఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటయ్య, వైసీపీ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు మునగల రంగనాయకులు మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు ఎనలేని కృషి చేసిన అంబేద్కర్ భావితరాలకు ఆదర్శనీయులు అన్నారు. అణగారిన కులంలో జన్మించి ఉన్నత విద్యనభ్యశించిన అంబేద్కర్ దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహోన్నతుడని తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాతగా, దేశానికి తొలి న్యాయశాఖ మంత్రిగా అనేక సేవలు అందించిన అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. ఈకార్యక్రమంలో బిఎస్పీ, వైసీపీ, దళిత, ఎస్సీ, ఎస్టీ, బిసి, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కి నివాళులు

**గాండ్లపెంట ప్రభాతవార్త డిసెంబర్ 6**

మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కి 69వ వర్ధంతి సందర్భంగా ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

**NAME DECLARATION**

I, THONDEBAVI VENKATARAMANAPPA SARASWATHAMMA, W/o. T. Kristappa, residing at 13-11-4, Bangalore Road, Hindupur, Sri Sathya Sai Dist., A.P. state that my name is mentioned in several documents as: THONDEBAVI VENKATARAMANAPPA SARASWATHAMMA I Hereby submit that I have changed my name to THIRUMALA SARASWATHAMMA from now onwards I will be called as THIRUMALA SARASWATHAMMA or SARASWATHAMMA THIRUMALA

**CHANGE OF NAME**

I, THALANKI RATNAIAH VENKATESH GUPTA (OLD NAME) S/O THALANKI RATNAIAH, H.NO:15-809, SAMRAT COMPLEX RF ROAD, ANANTAPUR-515001 (A.P),I HAVE CHANGED MY NAME FROM THALANKI RATNAIAH VENKATESH GUPTA (OLD NAME) TO THALANKI VENKATESH GUPTA (NEW NAME) HENCEFORTH I AM BEING CALLED THALANKI VENKATESH GUPTA (NEW NAME) FOR ALL PURPOSES.

**CHANGE OF NAME**

I, LAVANYA SAMRAT THALANKI (OLD NAME) D/O SATRASALA SREENIVASULU, H.NO: 1-357, BY PASS ROAD, OPP TO VEMALA THEATRE, KADIRI - 515591 (A.P).I HAVE CHANGED MY NAME FROM LAVANYA SAMRAT THALANKI (OLD NAME) TO SATRASALA LAVANYA (NEW NAME) HENCEFORTH I AM BEING CALLED SATRASALA LAVANYA (NEW NAME) FOR ALL PURPOSES.

04ATP13_04ATP13.qxd 06-12-2025 PM 10:51 Page 1



# అన్నదాతల ఆత్మహత్యలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి..!

- పంటలకు గిట్టుబాటు ధరలేక పడుతున్న కష్టాలకు అరటి రైతులే ఉదాహరణ
- కూటమి ప్రభుత్వ నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంతా భోగస్
- 18 నెలల కూటమి పాలనలో రైతుల పరిస్థితి మరింత దిగజారింది
- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి


విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

**ఉరవకొండ, డిసెంబరు 6 ప్రభాతవార్త**

రాష్ట్రంలో జరుగుతున్న అన్నదాతల ఆత్మహత్యలకు కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఎల్లుట్లలో నాగలింగమయ్య అనే రైతు చిన్న వయసులోనే ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని అరటి పండించే రైతుల దుస్థితికి అది అద్దం పడుతోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజక వర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. పట్టణం లోని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతన్న మీకోసం అంటూ ప్రభుత్వ నిర్వహించిన కార్యక్రమం అంతా భోగస్ అని అందులో రైతులెవరూ పాల్గొన లేదన్నారు. రైతులను మభ్యపెట్టి వారి దృష్టిని మరల్చడానికి సీయం చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమం చేపట్టి అతి తక్కువ సిబ్బందితో లక్షలాది మంది రైతులను కలిసినట్టు వారి బాధలు తెలుసుకున్నట్టు, సలహాలు ఇచ్చినట్టు గొప్పలు మాత్రం చెప్పుకున్నారని విమర్శించారు. రైతుల వద్దకు వెళ్లడానికి ఎమ్మెల్యేలు భయపడ్డారని ఎద్దేవా చేశారు. 18 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో రైతుల పరిస్థితి దిగజారిందని రైతులు తీవ్ర నిరాశతో ఉన్నారని అన్నారు. ఒక టన్ను 23 నుంచి 24వేలు పలికిన అరటి నేడు కేజీ 50 రూపాయలు కూడా పలుకడంలేదన్నారు. ఈ ఏడాది మొక్కజొన్న అధికంగా పండించారని ఇదివరకు 2,600 క్వింటాల్ ఉండగా నేడు 1,400 రూపాయలు అందడమే కష్టమైందన్నారు. పత్తి 8,800 రూపాయలు ధర ఉంటే 6,000 రూపాయలకు పడిపోయిందన్నారు. కంది 3 లక్షల ఎకరాలకుపైగా సాగులో ఉండగా మంచి దిగుబడులు వస్తాయని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. అదును దాటిన తరువాత ఇచ్చినట్లు చెప్పుకున్న అరకొర పప్పుశెనగ సైతం టీడీపీ నాయకులే బ్లాక్ మార్కెట్‌కు తరలించారని వాపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వై.ఎస్.జగన్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించగా 50 లక్షల మంది ఇన్సూరెన్స్ చేసుకున్నారని నేడు 19 లక్షలు కూడా దాటలేదన్నారు.

### 10న ఉరవకొండలో కోటి సంతకాల సేకరణ పూర్తిపై కార్యక్రమం :

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన సంతకాల సేకరణ పూర్తి అయిందని నియోజకవర్గంలో 60వేల మంది నుండి సంతకాలను సేకరించామని ఈ సందర్భంగా 10వ తేదీన ఉరవకొండలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. కార్యక్రమం అనంతరం సంతకాల పత్రాలను జిల్లా కేంద్రం చేర్చి 13న 10వేల మందితో అనంతపురంలో ర్యాలీ నిర్వహించి వాటిని ప్రదర్శించడం జరుగుతుందన్నారు. అనంతరం వాటిని విజయవాడకు తరలించి 16న ప్రతిపక్ష నేత వై.ఎస్.జగన్ ఆధ్వర్యంలో గవర్నర్‌కు అందించడం జరుగుతుందని వివరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

### వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులను ఉపేక్షించం :

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ నాయకుల దాడులు అధికమయ్యాయని వాటిని ఉపక్షించేది లేదని వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. లత్తవరం ఎంపీటీసీ భర్త వెంకటేష్ నాయక్‌పై గ్రామ మాజీ సర్పంచ్ గోవిందప్ప దాడిచేసి కులం పేరుతో దూషించాడన్నారు. ఆయన గతంలో వైఎస్సార్‌సీపీ నాయకులపై ఇండ్లపై దాడి చేశారని, బీసీ బోయలపైన పార్టీ ఎస్టీసెల్ నాయకుడు ప్రసాద్ నాయక్‌పై దాడి చేశాడని ఇంత జరుగుతున్నా పోలీసులు సరైన రీతిలో స ్పందించడం లేదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి భయపడేలా కుట్ర పన్నుతున్నారని వాటికి అడ్డుకట్ట వేయాలని పార్టీ ఎస్టీసెల్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీను కలుస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీలు చందా చంద్రమ్మ, ఏ.సి.ఎర్రిస్వామి, మాజీ ఏఎంసీ ఛైర్మెన్ బోయ సుశీలమ్మ, మేజర్ పంచాయతీ సర్పంచ్ మీనుగ లలిత, మోపిడి సర్పంచ్ సిద్ధప్ప, పార్టీ బాధ్యులు ఈడిగ ప్రసాద్, జి.ఎర్రిస్వామిరెడ్డి, మూలగిరిపల్లి ఓబన్న, నాయకులు డిష్ సురేష్, చిదంబరి, వద్దే ఆంజినేయులు, పచ్చిరవి, బి.మల్లికార్జున, మహేష్, నగేష్, మైనుద్దీన్, ధనుంజయ, సుంకే నాయక్, వెంటేష్‌నాయక్, ప్రసాద్‌నాయక్, చిన్న భీమా తదితరులు పాల్గొన్నారు.

# సత్యసాయి జిల్లా ను అగ్రస్థానంలో నిలిచేలా కృషి చేయండి

- సమయం వృధా కాకుండా ప్రణాళిక బద్ధంగా సన్నద్ధం కండి - డిఇఓ జీ కృష్ణప్ప


బాలుర ఉన్నత పాఠశాలలో వందరోజు ల యాక్షన్ ప్లాన్ ను పరిశీలిస్తున్న డీఈవో జి కృష్ణప్ప, దృశ్యం

**కొత్తచెరువు డిసెంబర్ 6 ప్రభాతవార్త.**

మార్చిలో జరగబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్ష లలో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి శ్రీ సత్య సాయి జిల్లా ను అగ్రస్థానంలో నిలిచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డిఇఓ జీ కృష్ణప్ప అన్నారురాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యం లో పాఠశాలల్లో ప్రణాళిక బద్ధంగా నిర్వహిస్తున్న వందరోజుల యాక్షన్ ప్లాన్లు ప్రతి ఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు వంద రోజులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు ను పర్యవేక్షించడం లో భాగంగా శని వారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ను డీఈవో జి కృష్ణప్ప సందర్శించారు ఈ సందర్భంగా విద్యార్థులు యొక్క ప్రగతిని పరీక్షించారు విద్యార్థులు మార్చి లో జరగబోయే పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని ఒక ప్రణాళిక బద్ధంగా సమయం వృధా చేయకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు, వంద రోజులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై ప్రణాళికబద్ధంగా షెడ్యూలు ప్రకారం పరీక్షలకు ప్రిపేర్ కావాలని సూచించారు ప్రతిరోజు సబ్జెక్టు వారీగా జరిగే స్లిప్ టెస్టులకు తప్పకుండా హాజరు కావాలి. స్టడీ అవర్స్ సెలవు దినాలలో కూడా తప్పకుండా హాజరు కావాలన్నారు స్టడీ అవర్స్ షెడ్యూల్ ప్రకారం ఎలాంటి డివియేషన్ లేకుండా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు స్లిప్ టెస్ట్ ల కు సంబంధించి ఏ రోజు జవాబు పత్రాలను ఆరోజే మూల్యాంకన చేసి వెంటనే లీఫ్ యాప్ నందు నమోదు చేయాలని టీచర్స్ ఆదేశించారు, డీఈవో వెంట ఎంఈఓ లు జయచంద్ర, సోమశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక


విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**వజ్రకరూరు డిసెంబర్ 6 ప్రభాతవార్త**

మండలంలోని చిన్నహోతురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న వీణ అనే విద్యార్థిని జాతీయస్థాయి ఖో ఖో పోటీలకు ఎంపికైంది. నవంబర్ 28,29, 30 తేదీలలో అనకాపల్లి జిల్లాలోని లంకెపాలెం గ్రామంలో జరిగిన అండర్ 14 రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడ పోటీలలో ప్రతిభను చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. 2026 జనవరిలో రాజస్థాన్ లో జరిగే పోటీలలో పాల్గొంటుంది. విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారు.

# ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే ప్రజా దర్బార్

కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

**తలుపుల,డిసెంబర్06, ప్రభాతవార్త:**

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని కుర్లి గ్రామంలో శనివారం ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి పలు సమస్యల వినతులను స్వీకరించారు. ప్రజాసేవలో భాగంగా ప్రత్యక్షంగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అందరికీ అందుబాటులో ఉండి సేవలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ప్రజల సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం కూడా అధికారులే బాధ్యత తీసుకోవాలన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో పాలకులు ప్రజా సమస్యలను పూర్తిగా గాలికి వదిలి నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికి కొత్త పెన్షన్లు నివాస గృహాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ అభివృద్ధి సంక్షేమలను రెండు కళ్లుగా భావించి సమన్వయంతో పాలన కొనసాగుతోందని తెలిపారు. ముందు ముందు ఇంకా ఎన్నో సంక్షేమ పథకాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# బావితరాలకు ఆదర్శనీయులు డా.బిఆర్.అంబేద్కర్

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

**శింగనమల, డిసెంబర్ 6 ప్రభాతవార్త**

డా. బి ఆ ర్ . అ ం బే ద ్క ర్ బావితరాలకు ఆదర్శనీయమని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. శనివారం డా.బిఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని జడ్పి కార్యాలయం వద్ద ఉన్న డా.బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజుతో కలిసి శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సంరద్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశ రాజ్యాంగ నిర్మాత స్ఫూర్తి ప్రధాత డా.బిఆర్.అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా స్వామ్య వ్యవస్థను కాపాడుతూ ప్రజలు కోరిన పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళలు రాజకీయంగా, సామాజికంగా అన్ని రంగాల్లో పురుషులతోపాటు స్థిర పడ్డారంటే కేవలం డా.బిఆర్.అంబేద్కర్ కృషి వల్ల అనే విషయాన్ని ప్రతి మహిళా గుర్తు పెట్టుకోవాలని ఆమె పేర్కొన్నారు.


పత్రికా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

# డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కులాకు సంబంధించిన వాడు కాదు

- దేశానికి సంబంధించిన వాడు - అణగారిన వర్గాలకు వెలుగునిచ్చిన మహనీయుడు అంబేద్కర్ - సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్


అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళలర్పిస్తున్న శైలజనాథ్

**బుక్కరాయసముద్రం డిశంబర్ 6 ప్రభాతవార్త**

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కులాకు సంబందినవాడు కాదు కులాలకు హక్కులనిచ్చిన మహనీయుడు డా,,బాబాసాహెబ్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని వైసీపీ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ అన్నారు.శనివారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో ఆయన వర్ధంతి సందర్భంగ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు.ఈ సందర్భంగ వారు మీడియాతో మాట్లడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేరు చెప్పుకొని ఆయన ఆలోచనలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు.బడుగు బలహీన వర్గాలు తలెత్తికొని తిరుగుతున్నారంటే అది డాక్టరన బిఆర్ అంబేద్కర్ ఇచ్చిన గొప్ప బిక్ష,కొందరు రాజ్యాంగాన్ని మారుస్తామంటే,ఆయన చూపిన మార్గమే వారికి సమాధానం చెప్పుతుంది.డాక్టర్ బిఆర్ అంబేద్కర్ లేకపోయింటే ఈ దేశంలో 80% మంది ప్రజలు మానవహక్కులు లేకుండ ఉండేవాళ్ళ,సూద్దులుగా ఉండేవారు,అంబేద్కర్ విగ్రహం ఉన్నచోట ధైర్యం ఉంటుంది.న్యాయం ఉంటుందన్నారు.ప్రపంచంలోనే అణగారిన వారికి వెలుగునిచ్చిన ఏకైక మహాశక్తి అంబేద్కర్,హింస లేకుండ రాజ్యాంగం రాసి ప్రజలకు అధికారాలు అందించిన ఏకైక మహనీయుడు.ఓటు హక్కును కల్పించి ప్రజాస్వామ్యానికి జీవం పోసిన వారు.ఆయన ఆశయాల కోసం మనమందరం కలసి పనిచేయాలి ఇదే నిజమైన నివాలి అన్నారు.ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు వైసీపీ మండల అధ్యక్షులు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి,గ్రామ సర్పంచు పార్వతి,జడ్పిటీసీ నీలం భాస్కర్,పూల నారాయణస్వామి,ముసలన్న, శీనివాసురెడ్డి,అనంత్, ఉట్టి కాటమయ్య,నరేష్, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరికూటి కాటమయ్య,బుల్లే రాజ,రేకులకుంట లక్ష్మినారాయణ,రంగా(రాయల్),మండల ఎస్సీ సెల్ కన్వీనర్ మారుతి,రాజారెడ్డి,నిమ్మల భాస్కర్,ప్రసాద్,తోపాటు పలువును నాయకులు కార్యకర్తలు తదితిరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వాహన డ్రైవర్ల జిల్లా అధ్యక్షుడిగా రమేష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నిక


అధ్యక్షుడిగా ఎన్నికైన రమేష్‌బాబును సన్మానించిన డ్రైవర్ల అసోసియేషన్ నాయకులు

**అనంతపురం, డిసెంబరు 06, ప్రభాతవార్త**

ఏపి ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా పి.రమేష్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకుంది. శనివారం స్థానిక డిఆర్‌డిఏ కార్యాలయం ఆవరణంలో వున్న సంఘం భవన్‌లో జిల్లా ఏపిజెఏసి చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, నగర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, జాతీయ ధ్యక్షుడు వై.నాగేశ్వరరావులు సమక్షంలో పి.రమేష్‌బాబును జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యాక్రమంలో జిల్లా డ్రైవర్ల నాయకులు పి.నాగభూషణం, హెచ్.ఎం.బాషా, వై.మల్లికార్జున, అయూబ్, నారాయణస్వామి, ఖాజాసాబ్, బాబుదిన్, వెంకటరాముడు, విశ్రాంత ఉద్యోగులు ఎన్.ఎస్.వరదరాజులు, భాస్కర్‌తో పాటు జిల్లాలోని పలుప్రభుత్వ వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.

# సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించండి

- నగర కమిషనర్ బాలస్వామి



ఇంటింటి చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్ బాలస్వామి

**అనంతపురం డిసెంబరు06 ప్రభాతవార్త**

నగరంలో సంపూర్ణ పారిశుద్ధ ్య నిర్వహణపై ప్రజల్లో అవగాహణ కల్పించి చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా సేకరించేలా పర్యవేక్షణ అధికారులు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ బి.బాలస్వామి అదేశించాడు. శనివారం సాధారణ పర్యవేక్షణలో భాగంగా నగరంలో కమలానగర్, శ్రీకంఠం సర్కిల్, పాతవూరు మార్కెట్,గుత్తి రోడ్‌లోని అన్నా క్యాంటీన్‌తో పాటు ప్రధాన రహదారుల్లో పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటింటి చెత్తసేకరణ, మురికికాల్వల్లో పూడికతీత పనులతో పాటు అన్నా క్యాంటీన్‌లో అల్పాహార నాణ్యతను ఆయన పరిశీలించాడు. పారిశుద్ధ్య కార్మికుల విధులను అంకితభావంతో నిర్వర్తించాలని, నిర్లక్ష్యం వహించే కార్మికుల పట్ల శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శానిటేషన్ సెక్రటరీలకు ఆదేశించాడు. ఈ కార్యక్రమంలో డిప్యూటి కమిషనర్, ఇన్‌చార్జ్ ఆరోగ్య అధికారి డాక్టర్.బి.పావనితో పాటు ఆయా సర్కిల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

# పోలీసుశాఖకు మంచిపేరు తీసుకొచ్చేలా సమిష్టి విధులు నిర్వర్తిద్దాం

- ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దాం : జిల్లా ఎస్పీ పి.జగదీష్ పిలుపు




గౌరవ వందనం స్వీకరించిన జిల్లా ఎస్పీ, హోంగార్డులకు మిమ్మల్ని పంపిణీ చేసిన జిల్లా ఎస్పీ, హోంగార్డుల పనితీరు పైన మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

**అనంతపురం కలెక్టరేట్ డిసెంబర్ 6 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో శనివారం 63 వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ పి.జగదీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా సాయుధ హోంగార్డుల ప్లటూన్ల నుండీ గౌరవ వందనం స్వీకరించారు. ఈసందర్భంగా ఎస్పీ మట్లాడుతూ తొలినాళ్లలో వలంటీర్ వ్యవస్థగా ఏర్పాటైన హోంగార్డు వ్యవస్థ ప్రస్తుతం పోలీసుశాఖలో కీలకంగా ఉంటోంది. హోంగార్డులు పోలీసుశాఖలో అంతర్భాగం. పోలీసులతో సమానంగా అన్ని రకాల సేవలు అందిస్తుండటం అభినందనీయమాన్నారు.

### .. హోంగార్డుల గ్రీవేన్స్ స్వీకరణ ..

హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని ప్రత్యేకించి హోంగార్డులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా దర్భార్ నిర్వహించి ఫిర్యాదులు స్వీకరించారు. ఐ.డి కార్డులు జారీ చేయాలని, వ్యక్తిగత సమస్యలతో పాటు వృత్తిపరమైన సమస్యలను జిల్లా ఎస్పీ ముందు విన్నవించారు. ఈ సమస్యలన్నింటినీ సమగ్రంగా విని సాధ్యాసాధ్యాలను బట్టి త్వరితగతిన పరిష్కారం చూపుతామని ఎస్పీ గారు భరోసా ఇచ్చారు. అనంతరం హోంగార్డులకు స్పోర్ట్స్ మీట్ లో భాగంగా నిర్వహించిన 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ , లెమన్ స్పూన్ , బ్యాండ్ పార్టీ మ్యూజిక్ ప్లే , మ్యుజికల్ ఛేయిర్ విజేతలకు జిల్లా ఎస్పీ చేతుల మీదుగా మెమొంటోలు ప్రదానం చేశారు. 500 మంది హోంగార్డులకు టీషర్టులు పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, మహిళా డీఎస్పీ ఎస్ మహబూబ్ బాషా, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, సి.ఐ లు వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, రాజేంద్రనాథ్ యాదవ్ , జగదీష్ , శేఖర్, ఆర్ ఐ పవన్ కుమార్, ఆర్ ఎస్ ఐ లు హోంగార్డ్ ఇన్ఛార్జి జాఫర్, బాబ్జాన్ , మగ్బూల్, రమేష్ నాయక్ , జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, గాండ్ల హరినాథ్, లక్ష్మినారాయణ, శివ, జిల్లాలోని హోంగార్డులు, ఏ.ఆర్ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు

# హోంగార్డులు విధులు అభినందనీయం - ఎస్పీ ఎస్.సతీష్ కుమార్




హోంగార్డుల నుండి గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ఎస్పి సతీష్‌కుమార్ ,హోంగార్డులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా ఎస్పి, హోంగార్డులకు బహుమతులు ప్రదానం చేస్తున్న జిల్లా ఎస్పి

**పుట్టపర్తి, డిసెంబర్ 06, ప్రభాతవార్త**

పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డుల సేవలు అభినందనీయమని శ్రీసత్య సాయి జిల్లాఎస్పి ఎస్‌సతీష్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం 63వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌లోతొలుత సాయుధ హోంగార్డుల నుండి గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం పరేడ్‌పరిశీలన వాహనం పైవెళ్లి ప్లటూన్లను పరిశీలించారు. ఈ సంధర్భంగా జిల్లాఎస్పి మాట్లాడుతూ, 1946 సంవత్సరంలో బొంబాయి రాష్ట్రంలో హోంగార్డ్స్ ఆర్గనైజేషన్ ప్రారంభమైందని, అప్పటి ప్రధానమంత్రి అయిన స్వర్గీయ మొరార్జీ దేశాయ్ చేత మహారాష్ట్రలో సివిల్ గార్డ్స్ పేరుతో 1963 సంవత్సరంలో ఆవిర్భవించిన హోంగార్డు వ్యవస్థ పోలీసుశాఖలో కీలకంగా మారిందన్నారు. జిల్లాలో 305 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారని, అన్ని విభాగాలలో పోలీసులతో సమానంగా సమర్ధవంతంగా విధులు నిర్వహిస్తున్నారని ప్రసంశించారు. సాధారణ డ్యూటీలు మొదలుకొని, క్లిష్టతర విధుల వరకు అన్నింటా చక్కగా పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వం హోంగార్డ్స్ కు పోలీసుల ఉద్యోగాల ఎంపికలు ప్రత్యేక రిజర్వేషన్ కూడా కేటాయించిందని, ప్రతి ఒక్క హోంగార్డు నిజాయితీగా పని చేయాలన్నారు. క్రమశిక్షణతో మెలుగుతూ పోలీసు ప్రతిష్టనుపెంచేలా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే క్రమంలో అంకితభావంతో పని చేయాలని తెలియజేశారు. హోంగార్డుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఫిట్నెస్ కలిగిఉండి తమఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికితీసుకువస్తే మీసమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని ఎస్పీ తెలియజేశారు. కవాతు ప్రదర్శన నిర్వహించిన హోంగార్డ్స్ తో పాటు ఈ కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించిన ఏ ఆర్ ఆర్మ్డ్ రిజర్వ్డ్ ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు మహేష్, వలి,ఆర్ఎస్ఐలు అధికారులను జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం హోంగార్డులకు నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ లో గెలుపొందిన హోంగార్డు సిబ్బంది విజేతలకు, విధులలో చక్కగా ప్రతిభ చూపిన హోంగార్డ్స్ తో పాటు పరేడ్ కమాండర్‌కు జిల్లా ఎస్పీ బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం ఐడి కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్ , ఏ ఆర్ డి ఎస్ పి శ్రీనివాసులు, సీఐ శివాంజనేయులు , ఆర్ఐ లు వలి, మహేష్, ఆర్ ఎస్సై ప్రసాద్ , ఎఆర్ ఏఎస్ఐ శ్రీరాములు, హోంగార్డ్ ఇంచార్జ్ రామాంజనేయులు, హోంగార్డు సిబ్బంది ఉన్నారు.